క్లుప్తంగా

రూ.10వేలు ఆర్థిక సాయం



గంపలగూడెం(జగ్గయ్యపేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కార్యదర్శి కొమ్ము కొండలు కుటుంబానికి ఆపార్టీ పట్టణ కార్యదర్శి వట్టెం మనోహర్ రూ.10వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కొండలు సతీమణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న మనోహర్ ఈమేరకు శనివారం ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కన్నమాల శ్యామ్యూల్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి శీలం మంగారావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు దివ్వెల రామారావు, మాదుగుల శ్రీనివాసరావు, ఓర్సు అంకమ్మరావు, మాసు, పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పెనుగంచిప్రోలు: మండలంలోని ముచ్చింతాల గ్రామానికి చెందిన బాలికను పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎంకే అర్జున్ కథనం మేరకు.. ముచ్చింతాలకు చెందిన ఓ బాలికను కుటుంబసభ్యులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్ఐ అర్జున్ తన సిబ్బంది సహాయంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలిక తొలుత విజయవాడ వెళ్లి అక్కడ్నుంచి మధిర, అక్కడి నుంచి ఖమ్మం వెళ్లినట్లు గుర్తించారు. బాలికను ఖమ్మం నుంచి తీసుకుని వచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

ఓ ఇసుక లారీ, నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం

జగ్గయ్యపేట: తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శనివారం తెలిపారు. చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో తెల్లవారుజామున వాహనాల తనిఖీ చేస్తుండగా, చందర్లపాడు మండలం కాసరబాద నుంచి ఇసుక లారీ తెలంగాణ వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విజయవాడ వెళ్లాల్సిన బిల్లులతో తెలంగాణ వైపు వెళ్తుండటంతో లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, లింగాల క్వారీల నుంచి మండలంలోని అన్నవరం మీదుగా తెలంగాణకు ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

కన్నుల పండువగా విఘ్నేశ్వరుని కల్యాణం




నందిగామరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వేంచేసియున్న సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ముందుగా సుప్రభాతసేవ, గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంపై పలువురు దంపతులు పీటలపై కూర్చుని సిద్ధి, బుద్ధి సహిత విఘ్నేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అన్నవరపు తిరుపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి చెందిన దొంగరి మంగయ్య, కవిత దంపతులు రూ.10,116 ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నాహాలు



వత్సవాయి: మే నెల ముగిసింది. వర్షాలు కూడా అడపాదడపా పడుతున్నాయి. పొలాలు బాగుచేసే పనుల్లో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు. గతేడాది వేసిన పంటను ట్రాక్టర్లతో తొలగించడం, గట్ల వెంబడి పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించి వాటిని తగలబెడుతున్నారు. వర్షాలు ముందస్తుగా పడే సూచనలు కనపడుతుండటంతో విత్తనం చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- పేరకలపాడులో యథేచ్ఛగా ఊరచెరువు మట్టి తరలింపు..
- పొక్లెయిన్ పెట్టి మరీ తవ్వకాలు
- దగ్గరుండి పర్యవేక్షిస్తున్న కూటమి నేతలు
- వెంచర్లకు తరలిస్తున్న వైనం
- ఈ గోతుల్లో పడి గతంలో ముగ్గురు విద్యార్థులు మృతి
- పట్టించుకోని అధికారులు



పేరకలపాడు ఊరచెరువులో పొక్లెయిన్‌తో మట్టిని తవ్వుతూ ట్రాక్టర్‌తో తరలిస్తున్న దృశ్యం

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఉన్న కృష్ణా, మునేటి పరివాహక గ్రామాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతుంటే... పచ్చని పల్లెల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. అధికారుల అలసత్వాన్ని ఆసరా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియాకు ఇప్పుడు మట్టి మాఫియా కూడా తోడుకావడంతో ప్రకృతి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతోంది. ముఖ్యంగా కంచికచర్ల మండలంలోని పేరకలపాడు, పరిటాల, గండేపల్లి గ్రామాల పరిధిలోని చెరువు నుంచి కూటమి నేతలు ఇష్టారీతిన మట్టి తోలకాలు సాగిస్తున్నారు.

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు..

మట్టిని విక్రయిస్తూ అక్రమార్జనతో తెలుగు తమ్ముళ్లు లక్షలు కొల్లగొడుతున్నారు. పేరకలపాడు, పరిటాల, గండేపల్లి గ్రామాల్లో చెరువులో ప్రొక్లెయిన్ వంటి భారీ యంత్రాలను ఉపయోగించి రోజుకు వందలాది ట్రాక్టర్ల మట్టిని తవ్వుతున్నారు. పేరకలపాడు ఊర చెరువునుంచి మట్టిని తవ్వి వీరులపాడు మండలంలోని పొన్నవరం, ఎస్.అమరవరం సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. ట్రాక్టర్ ట్రక్కు మట్టిని రూ. 800 నుంచి 1,500 నుంచి వరకు విక్రయిస్తూ తెలుగుతమ్ముళ్లు నిత్యం లక్షలాది రూపాయలతో జేబులు నింపుకుంటున్నారు.

పత్తా లేని అధికారులు..

మట్టి అక్రమ తవ్వకాలను సంబంధిత అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పేరకలపాడు ఊరచెరువులో భారీగోతులు పెట్టి మట్టిని తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా...ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఆవైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఎటువంటి అనుమతులు లేకుండానే నిత్యం వందలాది ట్రాక్టర్ల మట్టి తరలివెళ్తున్న వైనంపై అధికారులు నిద్రనటిస్తుండటం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలా అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో వర్షాకాలంలో నీటిని తాగేందుకు చెరువులోకి దిగిన మూగజీవాలు సైతం ఆభారీ గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువు గోతుల్లో పడి మృతిచెందిన చిన్నారులు (ఫైల్)

గతంలో ముగ్గురు విద్యార్థులు మృతి...

గతంలో టీడీపీ నేతలు చేసిన పాపం..ముగ్గురు చిన్నారుల పాలిట శాపంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వం(2014–19) హయాంలో ఈ పేరకలపాడు ఊరచెరువు నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా మట్టిని తరలించడంతో చెరువులో భారీ గోతులు ఏర్పడగా, ఆ గోతుల్లో పడి గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతిచెందిన వైనాన్ని గ్రామస్తులు గుర్తుచేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా భారీ యంత్రాల సాయంతో చెరువు మట్టిని తరలిస్తుండటాన్ని చూసి ఈసారి ఎవరి ఉసురు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. ధనార్జన కోసం కూటమి నేతలు పాల్పడుతున్న ఇటువంటి దుశ్చర్యల కారణంగా ప్రజలు బలైపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం...

పేరకలపాడు ఊరచెరువులో మట్టి తవ్వకునేందుకు ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదు. ఈ చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. నాలుగు మండలాల బాధ్యతలు చూస్తుండటంతో మట్టి మాఫియాను నియంత్రించలేకపోతున్నా. తమ సిబ్బందిని పేరకలపాడు గ్రామానికి పంపించి మట్టి తవ్వకాలు జరగకుండా నిలుపుదలచేశాం. అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తరలించేవారిపై చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, కంచికచర్ల ఇరిగేషన్ ఏఈ

సేంద్రీయ సాగుపై రైతులకు అవగాహన

పెనుగంచిప్రోలు: సేంద్రీయ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం (లాంఫాం) శాస్త్రవేత్త డా.గోపాలస్వామి, కేంద్రీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(రాజమండ్రి) బి.రాజశేఖరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆదేశాల మేరకు మండలంలోని పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, అనిగండ్లపాడు గ్రామాల్లో గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఖరీఫ్ సంసిద్ధతకు వికసిత కృషి సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూమి సారవంతమవుతుందని వివరించారు. మిరపలో యాజమాన్య పద్ధతులు, పెరటి తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త ఐ.వెంకటరెడ్డి, ఏడీఓ భవాని, ఏఓ రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, రైతులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా, పక్కన శాస్త్రవేత్తలు

యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ



నందిగామలో యోగాంధ్ర ర్యాలీ చేస్తున్న అధికారులు



చిల్లకల్లులో యోగాసనాలు చేస్తున్న ఎంపీడీవో నితిన్, సిబ్బంది

నందిగామటౌన్: యోగాపై అవగాహన కల్పిస్తూ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నందిగామ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ మండల యోగాంధ్ర కోఆర్డినేటర్లు కృష్ణమోహన్, కవిత, యోగా గురువు గాడిపర్తి సీతారాం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగాసాధన చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి యోగాసనాల ప్రయోజనాలను వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమ మార్గమని సూచించారు. యోగా ట్రైనర్ అశ్వనీ పర్యవేక్షణలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఏవో మాధవశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ



పేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య



అంబారుపేటలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పీడీ శ్రీలక్ష్మి

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విలియంపేటలోని పింఛన్‌దారులకు శనివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి మైనేని రాధా, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లెల కొండయ్య, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు మారేపల్లి బాషా, మల్లెల సాయి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామరూరల్: సచివాలయ సిబ్బంది పింఛన్‌దారులకు సకాలంలో పింఛన్లను అందజేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి సూచించారు. మండలంలోని అంబారుపేట పింఛన్ల పంపిణీని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే ఆహారం నాణ్యతను పరిశీలించారు. సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని జుజ్జూరులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 8,596 మంది పింఛన్‌దారుల్లో తొలిరోజు 7,800 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు.

జగ్గయ్యపేట మండలంలో..

గౌరవరం(జగ్గయ్యపేట): మండలంలోని గౌరవరంలో సాగుతున్న పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ నితిన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 90 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యదర్శి సంక్రాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

నందిగామటౌన్: రేషన్ డీలర్లు కార్డుదారులతో మర్యాదగా నడుచుకుంటూ వారికి సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సురేష్‌బాబు శనివారం ఆదేశించారు. రేషన్ సరుకులను ఆదివారం నుంచి రేషన్ దుకాణాల ద్వారా పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీచేశారు. జూన్ 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, 65ఏళ్లకు పైబడిన వారికి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులను పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



కంచల గ్రామంలో డ్రైయిన్లలో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది



సైడ్‌కాల్వల్లో తీసిన పూడిక

సాక్షి ఎఫెక్ట్..

నందిగామరూరల్: మండలంలోని కంచలలో అధ్వానంగా ఉన్న పారిశుధ్య పరిస్థితిపై 'రోడ్లపైనే పారుతున్న మురుగు' శీర్షికన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. కంచల గ్రామంలో శనివారం పారిశుధ్య సిబ్బంది డ్రెయిన్లలో పూడికతీశారు. ఆయా చోట్ల మురుగునీటి పారుదలకు అవరోధంగా ఉన్న మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి జీవనజ్యోతి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి కుళాయిలకు చప్టాలు నిర్మిస్తామని తెలిపారు. పంచాయతీలో తీర్మానం చేసి గ్రామంలోని తూర్పుబజారులో డ్రైనేజీ నిర్మాణం చేపడతామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం


కంచికచర్ల: వైఎస్సార్ సీపీ నందిగామ మండల, పట్టణ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు శనివారం తెలిపారు. నందిగామలోని పట్టణ పార్టీ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

హోటళ్ల తనిఖీ

నందిగామ రూరల్: పరిశుభ్రత పాటించని హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ హోటళ్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే హోటళ్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని పాత బస్టాండ్‌లోని పలు హోటళ్లకు నోటీసులు జారీచేసినట్లు ఆయన వివరించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : ఏపీడీ

వీరులపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడే ఫీల్డ్‌అసిస్టెంట్లపై కఠినచర్యలు తీసుకుంటామని ఏపీడీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని నందలూరులో ఉపాధి హామీ పథకం కూలీల జాబితాలో తప్పులున్నాయనే ఫిర్యాదులు అందడంతో శనివారం ఆయన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి నూరుశాతం పని దినాలు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఉందన్నారు. నందలూరులో వీఆర్ఏ ఉపాధి పనులకు వస్తున్నాడనే ఫిర్యాదుపై విచారణ చేపట్టామని వివరించారు. అనంతరం ఉపాధి కూలీలతో ఏపీడీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వరరావు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

కౌలురైతులకు అవగాహన



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): కౌలురైతులు విధిగా కౌలురైతు గుర్తింపుకార్డులు తీసుకోవాలని ఏవో వరలక్ష్మి సూచించారు. అనుమంచిపల్లిలోని గ్రామసచివాలయంలో శనివారం కౌలుగుర్తింపుకార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ జూన్ 12వతేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కౌలురైతు గుర్తింపు కార్డు ఉంటేనే ఆయా ప్రభుత్వ పథకాలకు అర్హులని స్పష్టం చేశారు. కౌలురైతు గుర్తింపుకార్డుల కోసం రైతులు తమ ఆధార్ కార్డు, ఫొటో, సాగుచేసే భూమికి సంబంధించి పట్టాదార్ పాస్‌పుస్తకంతో గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, వీఆర్వో వెంకటరత్నం, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

నందిగామటౌన్: పట్టణంలోని రైతుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..మచిలీపట్నంనకు చెందిన పెందుర్తి సాయికుమార్ (25) ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం ద్విచక్రవాహనంపై నందిగామ వస్తుండగా లక్ష్మీప్రసన్న థియేటర్ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయికుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సత్కారం



బాణావత్ కపూర్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్ తదితరులు



ఎస్ఐ వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న డీసీపీ సరిత తదితరులు



మహ్మద్ తద్రేను సన్మానిస్తున్న అధికారులు



తహసీల్దార్ హుస్సేన్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

వీరులపాడు: అంకిత భావంతో పనిచేసే అధికారులు, ఉద్యోగులను ప్రజలు ఎన్నటికీ మరువరని ఆర్డీవో కె.బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ హుస్సేన్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హుస్సేన్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరరావు, ఏపీ ఆర్ఎస్ఏ నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, నందిగామ తహసీల్దార్ సురేష్‌బాబు, కంచికచర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, డీటీలు ఆంజనేయులు, నాగరాజు, నాయకులు బొమ్మిశెట్టి భాస్కరరావు, వట్టికొండ చంద్రమోహన్, పాటిబండ్ల జైపాల్, దాములూరి మధుసూదనరావు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బాణావత్ కపూర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మలక్‌బషీర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, బొజ్జగాని శ్రీనివాసరావు, ఎంఈఓ బాలాజీనాయక్, సూపరింటెండెంట్ ఆనంద కమలకుమారి, బండి మల్లికార్జునరావు, వేల్పుల రమేష్, పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేటఅర్బన్: పేట ఎస్ఐ–2గా పనిచేస్తున్న ఈవీ వెంకటేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వెంకటేశ్వరరావు దంపతులను అడ్మిన్ డీసీపీ సరిత, పోలీసు అధికారులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పేట ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన మహ్మద్ తద్రేఆలంను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మోహన్, పేట ప్రాంతీయ రవాణాశాఖ యూనిట్ ఆఫీస్ అధికారి ఎంవీఎస్.రాజు, కె.జయచంద్ర, నందిగామ ఆర్టీవో పద్మావతి, ఎంవీఐ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌–15 క్రికెట్ జట్టుకు గుంజ హరిణి ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణానికి చెందిన గుంజ హరిణి కృష్ణా జిల్లా అండర్–15 బాలికల క్రికెట్ జట్టుకు ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న హరిణి జిల్లా సెలక్షన్స్ సందర్భంగా వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌లో విశేషప్రతిభను కనబరచడంతో అండర్–15 జట్టుకు ఎంపిక చేశారు. హరిణి తండ్రి గుంజ వెంకటగురువులు తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. హరిణి రెండేళ్లుగా జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలోని బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏసీఏ కేడీసీఏ క్రికెట్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతోంది. అండర్–15జట్టుకు ఎంపికైన గుంజ హరిణిని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.